సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం, 2, అక్టోబర్, 2024



### అప్పన్నకు గరుడసేవ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారికి గరుడసేవ ఆలయ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు.




### విత్తన బంతులపై అవగాహన

విశాఖ: కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వివిధ రకాల విత్తనాలతో విత్తన బంతుల తయారీపై అవగాహన కల్పించారు.



### కనకమ్మకు కుంకుమార్చన

విశాఖ: కనకమహాలక్ష్మి ఆలయంలో లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజల్లో ఉభయదాతలు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### గిరిజన వ్యవహారాలశాఖ కార్యదర్శికి అరకు కాఫీ పౌడర్ బహూకరణ



కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ కార్యదర్శి విభు నాయర్‌కు అరకు కాఫీ పొడిని అందజేస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యవహారాల శాఖ కార్యదర్శి విభు నాయర్‌ను మంగళవారం జార్ఖండ్ రాష్ట్రం హజారీబాగ్‌లో పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అరకు కాఫీ పొడిని ఆయనకు అందజేశారు. ఐటీడీఏ పరిధిలో అమలవుతున్న జన్‌మన్ కార్యక్రమం ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చించారు. గిరిజన ప్రాంతాభివృద్ధికి మరిన్ని నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరినట్టు పీవో తెలిపారు. ఐటీడీఏ పరిధిలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల భవన నిర్మాణాల వివరాలను ఆయనకు తెలియజేసినట్టు పీవో తెలిపారు.

### పర్యాటక ప్రాంతాల్లో పూర్తిస్థాయి భద్రత

- కలెక్టర్ దినేష్‌కుమార్

మారేడుమిల్లి: పర్యాటక ప్రాంతాల్లో పూర్తిస్థాయి భద్రత సౌకర్యాలు కల్పించిన తరువాత మాత్రమే సందర్శకులను అనుమతించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆయన ఇటీవల వైద్య విద్యార్థులు గల్లంతైన జలతరంగిణి ప్రాంతాన్ని పరిశీలించారు. సిబ్బంది తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీర కిషోర్, వైస్ ఎంపీపీ లక్కొండ రవికుమార్, సర్పంచ్ కొండ జాకబ్ పాల్గొన్నారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలి

- ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది వినతి



అరకు సంతబయలులో మద్యం దుకాణం వద్ద నిరసన తెలుపుతున్న సిబ్బంది

డుంబ్రిగుడ: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న తమను కొనసాగించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది డిమాండ్ చేశారు. మంగళవారం అరకు సంతబయలులో మద్యం దుకాణం వద్ద వారు ప్లకార్డులతో నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేట్ దుకాణాలు ఏర్పాటుచేయడం వల్ల తమకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యను గుర్తించి కొనసాగించాలని వారు వేడుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నా చంద్రబాబు తమ సమస్యను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సోమేశ్వరావు, సిబ్బంది కృష్ణ, సన్యాసిరావు పాల్గొన్నారు.

### మూడు గంటలపాటు అప్పన్న దర్శనాలు బంద్



ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న దేవస్థానం ఉద్యోగి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ తిరుమంజన్ సేవ(ఆలయశుద్ధి) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు స్వామి దర్శనాలు బంద్ చేశారు. అనంతరం ఆలయ బేడా మండపం, ఆస్థానమండపం, ఆలయ ప్రాంగణాన్ని నీటితో శుభ్రం చేశారు. అలాగే స్వామివారి నిత్య, వార్షిక ఉత్సవాలకు అవసరమైన సామగ్రిని శుభ్రపరిచారు. అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి దర్శనాలను భక్తులకు కల్పించారు.

# పండుటాకుల అష్టకష్టాలు



పాడేరు ఘాట్‌రోడ్డులో పింఛన్ సొమ్ము కోసం పడిగాపులు కాస్తున్న ఓబర్తి గ్రామ పింఛనుదారులు

- పింఛను సొమ్ము పొందేందుకు నానా అవస్థలు
- ఇళ్లవద్దకు వెళ్లని గ్రామసచివాలయాల సిబ్బంది
- అందరినీ ఒకేచోటకు రప్పించి పంపిణీ
- మళ్లీ కష్టాలు మొదలయ్యాయని వృద్ధుల ఆవేదన

సాక్షి,పాడేరు: పండుటాకులకు మళ్లీ పింఛను కష్టాలు మొదలయ్యాయి. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అందజేయకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే పింఛను సొమ్ము అందేది. సామాజిక పింఛనుదారులకు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చేవారు. గ్రామసచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు వేకువజామునే పింఛనుదారుల తలుపుతట్టేవారు. గిరిశిఖర గ్రామాల్లో సైతం తెల్లవారేసరికి పింఛను జరిగేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి పింఛనుదారులకు మళ్లీ ఇబ్బందులు మొదలయ్యాయి. ఈనెల కూడా వారి ఇళ్లకు వెళ్లి పింఛను అందజేయలేదు. మారేడుమిల్లి మండలం దొరవీధిలో మినహా మిగిలిన గ్రామసచివాలయాల పరిధిలో ఇదే పరిస్థితి. సుమారు 75శాతం గ్రామాల్లో తొలిరోజు ఇంటింటికి పింఛన్ పంపిణీ జరగలేదు. దీంతో గ్రామాల్లోని పింఛనుదారులు గ్రామసచివాలయాలు, పంచాయతీ కేంద్రాలు, ప్రధాన జంక్షన్లు, కూడళ్లలో పడిగాపులు పడాల్సి వచ్చింది. సచివాలయాల సిబ్బందికి పింఛను పంపిణీ బాధ్యత అప్పగించినప్పటికీ వారు ఇంటింటికీ వెళ్లలేదు. అందరినీ ఒకేచోటకు రప్పించి పింఛను పంపిణీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు కాలినడకన వచ్చేందుకు నానా అవస్థలు పడ్డారు.

- పాడేరు ఘాట్‌లో వంట్లమామిడి పంచాయతీ మారుమూల ఓబర్తి గ్రామానికి చెందిన పింఛనుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలినడకన గంటన్నరసేపు కొండెక్కి ఉదయం ఏడు గంటలకు ఘాట్‌రోడ్డుకు చేరుకున్నారు. గ్రామసచివాలయ సిబ్బందికోసం గంటల తరబడి రక్షణ గోడ వద్ద నిరీక్షించారు. ఇదే పరిస్థితి చాలాచోట్ల కనిపించింది.

**తగ్గుతున్న పింఛన్ల సంఖ్య**

జిల్లాలో పింఛన్ల సంఖ్య ప్రతినెలా తగ్గుతోంది. ఈనెల కూడా 491 పింఛన్లు తగ్గాయి. పింఛనుదారుల్లో మృతుల పేర్లను తొలగిస్తున్నామని డీఆర్‌డీఏ అధికారులు పేర్కొంటున్నారు. అయితే వాటి వివరాలను మాత్రం బయటపెట్టడం లేదు. గత నెలలో పింఛనుదారుల్లో 677 మంది మృతిచెందారని డీఆర్‌డీఏ అధికారవర్గాలు చెబుతున్నాయి. గత నెలలో తొలగించిన పింఛన్లు మినహాయించి 1,25,269మందికి నగదు పంపిణీ చేశారు. ఈనెలలో 491 తగ్గించి 1,24,778 మందికి ప్రభుత్వం రూ.52 కోట్లు మంజూరు చేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛనుదారుల సంఖ్య పెరుగుతుంటే, కూటమి ప్రభుత్వంలో మాత్రం ప్రతినెలా తగ్గడం అనుమానాలకు తావిస్తోంది.



కొండ ప్రాంతానికి వచ్చి పింఛను పొందుతున్న వర్మగుమ్మి లబ్ధిదారులు

**పడరాని పాట్లు**

ముంచంగిపుట్టు: మండలంలో పింఛను పొందేందులకు లబ్ధిదారులు పడరాని పాట్లు పడ్డారు. మండలంలోని 23 పంచాయతీల పరిధిలో గ్రామ సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లకుండా వారు ఇష్టానుసారంగా పంపిణీ చేశారు. సిబ్బంది ఇళ్లకు వెళ్లకపోవడంతో పింఛనుదారులు కొండలు,గుట్టలు ఎక్కి వచ్చి పింఛన్ పొందారు.మండలంలో 88.90శాతం పింఛన్ పంపిణీ జరిగిందని ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు.

**పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్**

మారేడుమిల్లి : స్థానిక దొరల వీధిలో కలెక్టర్ దినేష్ కుమార్, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీలతో కలిసి మంగళవారం లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి నెలా ఒకటిన లబ్ధిదారు ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తున్నారన్నారు.



మారేడుమిల్లిలో లబ్ధిదారునికి పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

### రెండు నెలలుగా ఇబ్బందులు



పింఛను సొమ్ము కోసం రెండు నెలల నుంచి ఇబ్బందులు పడుతున్నాం. కాలినడకన కొండెక్కి వెళ్లి గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి దయవల్ల వలంటీర్ ఇంటికి వచ్చి ఒకటో తేదీన పింఛను ఇచ్చేవాడు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కాలినడకన పింఛను ఇచ్చే చోటకు వెళ్లాల్సి వస్తోంది.

– గెమ్మెలి అచ్చియమ్మ, పింఛనుదారు, ఓబర్తి, వంట్లమామిడి, పాడేరు మండలం

### చంద్రబాబు హిందువులకు క్షమాపణ చెప్పాలి

మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ డిమాండ్



ముంచంగిపుట్టు: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతను దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు చేసిన సీఎం చంద్రబాబు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులకు క్షమాపణ చెప్పాలని అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ డిమాండ్ చేశారు. విదేశాల్లో ఉన్న ఆయన మంగళవారం ఫోన్లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీఎం స్థాయిలో ఉన్న చంద్రబాబు లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పు పట్టిందన్నారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందటంటూ చెప్పడం చాలా దారుణమని ఆయన ధ్వజమెత్తారు. చంద్రబాబు స్వార్థ, కుతంత్ర రాజకీయాలకు స్వామి వారే తగిన బుద్ధి చెబుతారని, కల్తీ నెయ్యి వ్యవహారంలో వాస్తవాలు త్వరలోనే బయటపడతాయని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డిని ఇబ్బంది పెట్టాలని, మత వివాదాన్ని రేపి హిందువులను ఆయనకు దూరం చేయాలని చంద్రబాబు చూస్తున్నారని విమర్శించారు. ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయాలని ఆయన కోరారు. కలియుగ దైవంతో ఆటలు ఆడితే పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు.

## నేడు ఏకలవ్య పాఠశాల భవనాలు ప్రారంభం



ప్రధానమంత్రి మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న మజ్జివలసలోని ఏకలవ్య పాఠశాల భవనం

- జార్ఖండ్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



పెదబయలులో ప్రారంభానికి సిద్ధమైన ఏకలవ్య పాఠశాల భవనం

సాక్షి,పాడేరు: కేంద్ర ప్రభుత్వం రూ.40 కోట్లతో కార్పొరేట్ స్థాయిలో పెదబయలు(లకేపుట్టు), అరకులోయ(మజ్జివలస)లో నిర్మించిన ఏకలవ్య పాఠశాలల భవన సముదాయాల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిని బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోది జార్ఖండ్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.అలాగే అనంతగిరి, హుకుంపేట మండలాల్లో రూ.40 కోట్లతో నిర్మించనున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల భవన నిర్మాణాలకు ప్రధానమంత్రి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు. ఈమేరకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

**పకనకుడిలో పీఎం జన్‌మన్ రద్దు**

అరకులోయ మండలం పకనగుడిలో బుధవారం జరగాల్సిన ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమం రద్దయిందని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. అక్టోబర్ 2న ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి మోది వర్చువల్‌గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని, అయితే అనివార్య కారణాల వల్ల ఈ కార్యక్రమం రద్దు అయిందని పీవో వివరించారు.

## స్వచ్ఛభారత్ సాధనకు కృషి

కలెక్టర్ దినేష్‌కుమార్



రంపచోడవరంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో కలెక్టర్ దినేష్ కుమార్

రంపచోడవరం : మహాత్మా గాంధీ స్వచ్ఛమైన దేశాభివృద్ధిని ఆకాంక్షించారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛభారత్ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ ర్యాలీలో ఆయనతోపాటు, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొన్నారు. ఐటీడీఏ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తను శ్రమదానంతో తొలగించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో వివిధ కళాశాలల విద్యార్థులు, సిబ్బందితో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీలో జరుగుతున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఏడాదిలో వంద గంటలు, వారంలో రెండు గంటలు శ్రమదానం చేసి పరిశుభ్రత ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంరతం విద్యార్థులు, అధికారులతో కలిసి స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు, ఏపీవో జనరల్ డీఎస్‌వీ రమణ, డీఎల్పీవో కోటేశ్వరరావు, ఎంపీడీవో హరికృష్ణ, సర్పంచ్ మంగా బొజ్జయ్య పాల్గొన్నారు.

## జాతీయ రహదారి వెడల్పు పెంపు

మలుపులో పది అడుగుల మేర విస్తరించిన అధికారులు



మలుపు వద్ద వెడల్పు పెరిగిన జాతీయ రహదారి

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో మలుపు వద్ద జాతీయ రహదారిని ఇంజినీరింగ్ మంగళవారం విస్తరించారు. రాజవొమ్మంగి నాలుగు రోడ్ల కూడలి వద్ద రహదారి నిర్మాణ పనులు లోపభూయిష్టంగా జరుగుతున్నాయని, ఇక్కడ రోడ్డు మరీ ఇరుకుగా ఉన్నందున ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు సోమవారం రాత్రి ఆందోళనకు దిగడం తెలిసిందే. దీనిపై సాక్షిలో ప్రచురితమైన కథనంపై జాతీయ రహదారి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. హైవే అథారిటీ అధికారులు, ఇంజనీర్లతో చర్చలు జరిపారు. ఇంజనీర్లు మరోసారి కొలతలు తీసి ప్రధాన కూడలి వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డును వెడల్పు చేశారు. ఈ ప్రాంతంలో రోడ్డు మరీ వంపుగా లేకుండా డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగుపరుస్తున్నట్లు ప్రకటించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా యంత్రాలతో రోడ్ వెడల్పు పెంచేందుకు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ సత్యనారాయణ, సీఐ సన్యాసినాయుడు వెడల్పు పనులను పర్యవేక్షించారు.

## సేంద్రియ కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు



ఆర్‌వీ నగర్ కాఫీ పరిశోధన స్థానంలో జరిగిన వేడుకల్లో శాస్త్రవేత్తలు, అధికారులు, ఉద్యోగులు

గూడెంకొత్తవీధి: గిరిజన ప్రాంతంలో సేంద్రియ విధానంలో పండించే కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు ఉందని ఆర్‌వీనగర్ ప్రాంతీయ కాఫీ పరిశోధన స్థానం ఇన్‌చార్జి అధిపతి డాక్టర్ సునీల్‌బాబు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ కాఫీ దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని ఆర్‌వీ నగర్ ప్రాంతీయ కాఫీ పరిశోధన స్థానంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రదర్శన ఏర్పాటుచేసి వాటి గురించి అధికారులు, ఉద్యోగులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయంగాను మన్యంలో గిరిజనులు పండించే కాఫీకి ప్రత్యేక ఆదరణ ఉందన్నారు. రైతులు విస్తరణతోపాటు దిగుబడి, నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో పరిశోధన స్థానం సేద్యవిభాగం శాస్త్రవేత్త డాక్టర్ రాజిబాపతి,భూసార విభాగం శాస్త్రవేత్త నగేష్, జేఎల్‌వో శ్రీనివాసరావు, ఏఈవో, గూడెంకొత్తవీధి, ఏపీగురుకుల కళాశాల , ఏకలవ్య, ఆర్వీనగర్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, కాఫీ రైతులు పాల్గొన్నారు.

**నాణ్యమైన కాఫీని ఉత్పత్తి చేయాలి**

చింతపల్లి: గిరిజన రైతులు మరింత నాణ్యత ప్రమాణాలతో కూడిన కాఫీని ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పాడేరు ఐటీడీఏ కాఫీ విభాగం సహాయ సంచాలకులు అశోక్ సూచించారు. అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం చింతపల్లి కేంద్ర కాఫీబోర్డు విస్తరణ కార్యాలయంలో కాఫీ రైతులతో ప్రత్యేక వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర కాఫీబోర్డు సభ్యుడు జైతి ప్రభాకర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో రైతులు పండించే కాఫీకి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. విదేశాల్లోనూ మన్యం కాఫీకి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. కాఫీ రైతులు దిగుబడితోపాటు మంచి నాణ్యతపై దృష్టి సారించాలని కాఫీ ఏడీ కోరారు. ఈ కార్యక్రమంలో విస్తరణ విభాగం జేఎల్‌వో ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.



కాఫీకి సంబంధించి ఏర్పాటుచేసిన స్టాల్



మాట్లాడుతున్న కాఫీ ఏడీ అశోక్ పక్కన కేంద్ర కాఫీబోర్డు సభ్యుడు జైతి ప్రభాకర్, జేఎల్‌వో

### 95.76 శాతం పింఛన్ల పంపిణీ

సాక్షి,పాడేరు: జిల్లాలోని 22 మండలాల పరిధిలో మంగళవారం రాత్రి 8.30 వరకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ తొలిరోజు 95.76శాతం పూర్తయ్యిందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు.1,24,778మంది పింఛన్‌దారులు ఉండగా,తొలిరోజు 1,19,482 మందికి అందజేసినట్టు ఆయన పేర్కొన్నారు.

### ఇక మద్యం వరదే..

ఉమ్మడి విశాఖ జిల్లాలో మద్యం ఏరులై పారనుంది. నగరంలో కాకుండా గ్రామాల్లో సైతం లిక్కర్ వరద ముంచెత్తనుంది. మరికొద్ది రోజుల్లో మద్యం వ్యాపారం మళ్లీ ప్రైవేటు మాఫియా కబంద హస్తాల్లోకి వెళ్లిపోనుంది. కొత్త మద్యం పాలసీ ద్వారా ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసి వేసి.. లాటరీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

10లో

## పౌష్టికాహారంతో మాతా శిశు మరణాలకు అడ్డుకట్ట

ఆర్‌జేడీ చిన్మయిదేవి



చింతపల్లిలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

చింతపల్లి: పౌష్టికాహారంతో మాతా శిశుమరణాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని శిశుసంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి అన్నారు. పోషకాహార మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆమె మంగళవారం హాజరయ్యారు. చింతపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు అందించే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఆధునిక హంగులు జోడించి కార్పొరేట్ స్థాయిలో సిద్ధం చేస్తున్నామన్నారు. సామూహిక సీమంతాలు నిర్వహించారు. పౌష్టికాహారానికి సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో ఆశాజ్యోతి, ఐసీడీఎస్ పీవో రమణి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, ఎంపీటీసీలు ధారలక్ష్మి, జయలక్ష్మి, వైస్‌ఎంపీపీ గోపీనాయక్ శారద పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయి సదుపాయాలు**

కొయ్యూరు: విశాఖ జోన్ ఆరు జిల్లాల పరిధిలో మొదటి విడతగా 280 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు రకాల సదుపాయాలు కల్పించినట్టు ఆర్‌జేడీ ఎం.చిన్మయిదేవి వెల్లడించారు. మంగళవారం ఆమె కొయ్యూరు గిరిజనభవన్‌లో అంగన్‌వాడీ సిబ్బందితో నిర్వహించిన సమావేశానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. సురక్షిత తాగునీరు, రన్నింగ్ వాటర్, మరుగుదొడ్లు, పిల్లలకు ఆట వస్తువులు, విద్యుదీకరణ, కిచెన్ గార్డెన్లు ఏర్పాటుచేశామన్నారు. దాదాపుగా 1,300 కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. వీటిని దశలవారీగా పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్టు చెప్పారు. మధ్యలో బడి మానేసిన పిల్లలను తిరిగి వారిని పాఠశాలల్లో చేర్పిస్తున్నామని తెలిపారు. బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పార్వతీపురం మన్యం,అల్లూరి జిల్లాల్లో 2,246 మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్పునకు ప్రతిపాదించామని ఆమె వెల్లడించారు. పాడైన భవనాల స్థానంలో కొత్తవి నిర్మించడం, లేదంటే మరమ్మతులు చేపట్టేలా ప్రతిపాదనలు పంపించినట్టు తెలిపారు. తల్లీబిడ్డల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కొయ్యూరు ప్రాజెక్ట్ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 29 మందికి పోషణ మహా అవార్డులను అందజేశామని తెలిపారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు సీడీపీవో విజయకుమారి పాల్గొన్నారు.



పౌష్టికాహారంతో ఏర్పాటు చేసిన స్టాల్



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

## క్లుప్తంగా

### రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



గిరిజన రైతులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ జాహ్నవి

**చింతపల్లి:** చింతపల్లి మండలంలోని చౌడిపల్లి పంచాయతీ పశువులబంద గ్రామంలో అసిస్టెంట్ డైరెక్టర్ కంఠ జాహ్నవి, ఏవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వారు గిరిజన రైతులకు పలు సూచనలు చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించే దిశగా వ్యవసాయ శాఖతో అధికారులు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్పంచ్ లలిత, వైఎస్సార్‌సీపీ నాయకులు సింహాచలం, కరుణానిధి పాల్గొన్నారు.

### పర్యాటకుల భద్రతకు చర్యలు

- ఐటీడీఏ పీవో సింహాచలం



పింజరకొండ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

**అడ్డతీగల:** అడ్డతీగల మండలం పింజరకొండ పర్యాటక ప్రాంతం వద్ద పర్యాటకుల భద్రతకు తగిన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. పింజరకొండ జలపాతం, పరిసర ప్రాంతాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విహార యాత్రలకు వచ్చే పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజన్‌లో పర్యాటకుల తాకిడి గురించి, పింజరకొండ గ్రామస్తులు ఏలేరు వాగుపై ప్రయాణం తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ నరసింహమూర్తి, తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి, ఎంపీడీవో రంగారావు, ఎస్ఐ వినోద్ తదితరులున్నారు.

# ఇక మద్యం వరదే..







- జిల్లాల్లో ఏరులై పారనున్న లిక్కర్
- మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదల
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 331 షాపులు
- విశాఖలో 155, అనకాపల్లిలో 136, అల్లూరిలో 40 షాపుల కేటాయింపు
- 9 వరకు దరఖాస్తుల స్వీకరణ, 11న లాటరీ విధానంలో షాపుల కేటాయింపు
- రూ.2 లక్షలు నాన్‌రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు

**విశాఖ సిటీ :** ఉమ్మడి విశాఖలో మద్యం ఏరులై పారనుంది. నగరంలో కాకుండా గ్రామాల్లో సైతం లిక్కర్ వరద ముంచెత్తనుంది. మరికొద్ది రోజుల్లో మద్యం వ్యాపారం మళ్లీ ప్రైవేటు మాఫియా కబంధ హస్తాల్లోకి వెళ్లిపోనుంది. 2019కు ముందు విధానాన్నే మళ్లీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కొత్త మద్యం పాలసీ ద్వారా ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసి వేసి.. లాటరీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీంతో గత అయిదేళ్లు లిక్కర్ వ్యాపారానికి దూరంగా ఉన్న సిండికేట్లు మళ్లీ జవసత్వాలు నింపుకొని బరిలోకి దిగారు. ఇదిలా ఉంటే.. ప్రభుత్వ నిర్వహణలో సాగుతున్న మద్యం దుకాణాల్లో పనిచేసిన సిబ్బంది ఇప్పుడు ఉపాధి కోల్పోనున్నారు. నాణ్యమైన మద్యాన్ని తగ్గింపు ధరలకు అందుబాటులోకి తెస్తామంటూ ప్రభుత్వం ఆశచూపింది. ప్రస్తుతమున్న ప్రభుత్వ మద్యం దుకాణాల కంటే వాటి సంఖ్య పెరగనుండడంతో మద్యం ఏరులై పారనుంది. వీటితో పాటు ఇప్పుడు మళ్లీ బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

### రూ.3 వేల కోట్లే లక్ష్యం

సర్కారుకు ఆదాయం సమకూర్చే వనరుల్లో ఎక్సైజ్ శాఖ అత్యంత కీలకంగా మారింది. విశాఖ జిల్లాలో ఈ శాఖ ద్వారా ఏడాదికి రూ.3 వేల కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు తగ్గట్టుగానే ప్రస్తుతమున్న షాపుల సంఖ్య కంటే అధికంగా జిల్లాకు కేటాయించింది. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాలు 313 ఉండగా.. ఆ సంఖ్య ఇకపై 331 షాపులకు పెరగనున్నాయి. దీంతో మద్యం విక్రయాలు కూడా భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయి.



### షాపుల కోసం తీవ్ర పోటీ

2019 ముందు వరకు లిక్కర్ వ్యాపారాన్నే నమ్ముకున్న ఉన్న వారిలో ఇప్పుడు మళ్లీ పునరుజ్జీవం కనిపిస్తోంది. అయిదేళ్లు వ్యాపారానికి దూరమైన సిండికేట్లు ఇప్పుడు మద్యం షాపులను చేజిక్కించుకోవడానికి ఇప్పటికే తెరవెనుక ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈసారి మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు సైతం భావిస్తున్నారు. ఎంత ఎక్కువ మంది పోటీ పడి దరఖాస్తులు చేస్తే.. అంతటి స్థాయిలో నాన్‌రిఫండబుల్ ఫీజు రూ.2 లక్షల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.

### మూడు విధానాల్లో దరఖాస్తులు



దరఖాస్తులను మూడు విధానాల్లో సమర్పించే అవకాశాలు కల్పించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రామచంద్రమూర్తి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దరఖాస్తుదారులకు ఎటువంటి సందేహాలు ఉన్నా.. దగ్గరలో ఉన్న ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంప్రదిస్తే దరఖాస్తు సమర్పించే విధానాన్ని తెలియజేస్తారని చెప్పారు. ఈ నెల 11న వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో కలెక్టర్ హరేందిర ప్రసాద్ సమక్షంలో లాటరీ నిర్వహిస్తామని వెల్లడించారు. అలాగే అదే రోజు అనకాపల్లిలో ఓల్డ్ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఉప్పాడ చంద్రశేఖర్ కల్యాణ మండపంలోను, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు మండలంలో ఎస్పీ ఆఫీస్ సమీపంలో ఉన్న వియా ఫంక్షన్ హాల్‌లో లాటరీ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

### అప్పుడే బెల్టు భయం

గత టీడీపీ హయాంలో బెల్టు షాపులు కోకొల్లలుగా ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బెల్టు షాపులను పూర్తిగా నియంత్రించారు. తాజాగా పాత విధానం అమల్లోకి వస్తుండడంతో మళ్లీ బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అప్పట్లో మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వ ఖజానా నింపుకోవడానికి టీడీపీ ప్రభుత్వం షాపులకు లక్ష్యాలను నిర్దేశించింది. ప్రతి నెలా గరిష్ఠంగా మద్యం సరుకును కొనుగోలు చేయాలని ఎక్సైజ్ అధికారుల ద్వారా ఒత్తిడి చేసేది. ఈ క్రమంలో మద్యం షాపుల నిర్వాహకులకు మూడు నుంచి అయిదు బెల్టు షాపుల నిర్వహణకు అనధికారికంగా అనుమతులిచ్చేవారు. దీంతో విచ్చలవిడిగా, బహిరంగంగా మద్యం విక్రయించినా అధికారులు పట్టించుకున్న సందర్భాలు ఉండేవి కాదు. ఈ బెల్టు షాపుల బరితెగింపుపై అప్పట్లో మహిళా సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు తెలిపేవి. ప్రస్తుతం అదే స్థాయిలో మళ్లీ బెల్టు షాపులు పుట్టుకొచ్చే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే మహిళా సంఘాలు ఆందోళన బాట పట్టాయి.

### 331 లిక్కర్ షాపులకు నోటిఫికేషన్

నూతన మద్యం పాలసీ ప్రకారం విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీని ప్రకారం ఉమ్మడి విశాఖలో 331 షాపులకు నోటిఫికేషన్ ఇచ్చారు. విశాఖ జిల్లాలో 155 షాపులు కేటాయించగా.. జీవీఎంసీ పరిధిలో 136 షాపులు రానున్నాయి. అలాగే అనకాపల్లి జిల్లాలో 136 షాపులు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 40 షాపులు ఏర్పాటుకానున్నాయి. ఒక్కో షాపు కోసం దరఖాస్తుదారులు రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

## వివాహిత అదృశ్యం

**అనకాపల్లి:** ఓ వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు కథనం మేరకు.. మండలంలో దేవినగర్ ప్రాంతానికి చెందిన సౌజన్య నాలుగేళ్ల కుమార్తెతో సోమవారం ఇంటి నుంచి బజార్‌కు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె భర్త శివసాయి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గుండెపోటుతో వార్డెన్ మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

**నక్కపల్లి:** మండల కేంద్రం నక్కపల్లి ఎస్సీ బాలుర వసతి గృహ వార్డెన్ చొప్పా శ్రీనివాసరావు(52) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. అనకాపల్లిలో నివాసం ఉంటున్న ఆయనకు తెల్లవారు జామునే ఇంటి వద్ద ఉండగా గుండె పోటు వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీనివాసరావు మృతి పట్ల స్నేహితులు, పలు వసతి గృహాల సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. శ్రీనివాసరావు స్వగ్రామం సారిపల్లి పాలెం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## గణేష్ నిమజ్జనంలో విషాదం

- విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి



పోలవరపు శ్యామ్ మృతదేహం

**మునగపాక:** మునగపాకలో సోమవారం రాత్రి జరిగిన గణేష్ నిమజ్జనంలో విషాదం నెలకొంది. విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పరవాడ మండలం రావాడ పంచాయతీ ధర్మారాయుడుపేటకు చెందిన పోలవరపు పైడికొండ కుమారుడు శ్యామ్(22) పరవాడలోని ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఖాళీగా ఉన్న సమయంలో డీజే నిర్వాహకులతో పని చేస్తుంటాడు. దీనిలో భాగంగా సోమవారం రాత్రి మునగపాకలో వినాయక నిమజ్జనానికి బంధువులకు చెందిన డీజేను తీసుకువచ్చాడు. వినాయక ఊరేగింపులో భాగంగా కొంత సేపటి తరువాత విద్యుత్ షాక్‌కు గురై శ్యామ్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు అతనిని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలుస్తాడనుకున్న కుమారుడు అర్ధంతరంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. శ్యామ్ తండ్రి పైడికొండ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## గిరిజన విలేకరుల ఇళ్ల షెడ్లను తొలగించిన టీడీపీ సర్పంచ్

జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

**పాడేరు :** మండలంలోని లగిసపల్లి పంచాయతీ కేజీబీవీ పాఠశాల సమీపంలో గతంలో అక్రిడిటేషన్ కలిగిన పది మంది గిరిజన విలేకరులకు కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక షెడ్లను లగిసపల్లికి చెందిన టీడీపీ సర్పంచ్ లకే పార్వతమ్మ, తన అనుచరులతో కలిసి మంగళవారం తొలగించారు. 2016 సంవత్సరంలో అప్పటి ఐటీడీఏ పీవో, అప్పటి ఎమ్మెల్యే స్థానిక గిరిజన విలేకరులకు లగిసపల్లి సర్వే నెంబర్–47 ప్రభుత్వ భూమిలో ఒక్కొక్కరికి 3సెంట్ల స్థలాన్ని కేటాయించి లే అవుట్ వేసి అప్పగించి ఎల్‌పీజీలు జారీ చేశారు. ఆ స్థలంలో పది మంది విలేకరులు తాత్కాలికంగా రేకులతో షెడ్లను నిర్మించుకున్నారు. ఉన్నట్టుండి లగిసపల్లికి చెందిన టీడీపీ సర్పంచ్ లకే పార్వతమ్మ ఆ స్థలం పంచాయతీకి చెందిన గ్రామ కంఠం భూమి అని మంగళవారం తన అనుచరులతో వెళ్లి ఆ షెడ్లను ధ్వంసం చేయించి అక్కడ సామగ్రిని వెంట తీసుకు వెళ్లారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్‌ను విలేకరులు కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై స్టేటస్ కో ఉన్నప్పటికి సర్పంచ్ లకే పార్వతమ్మ వాటిని ధిక్కరించి రేకుల షెడ్లను ధ్వంసం చేశారని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి ఆమెపై, ఆమె అనుచరులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం చేయాలని గిరిజన విలేకరులు ఎస్పీను కోరారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్, ఏఎస్పీ ధీరాజ్, సిఐ ధీనబంధుకు సూచించారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, చిత్రంలో హెచ్‌ఎం తదితరులు

**హుకుంపేట:** నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్టడీ మెటీరియల్ అందజేసినట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.సువర్ణరాజు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఏకలవ్య ఫౌండేషన చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఉపాధ్యాయులు పరశురాం, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి సత్యనారాయణ పాల్గొన్నారు.

## బస్సులో నుంచి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన ప్రయాణికుడు మనోజ్ మండల్

**కూనవరం :** బస్సులో నుంచి పడి ప్రయాణికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నర్సింగపేట గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సింగారపురం గ్రామానికి చెందిన మనోజ్ మండల్ (45) సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి జగ్దల్‌పూర్ వెళ్లేందుకు గుప్తా ట్రావెల్స్ బస్‌లో బయలుదేరాడు. తెల్లవారు జామున కూనవరం మండలం నర్సింగపేట గ్రామ సమీపంలో బస్సులో నుంచి ప్రమాదశాత్తూ కిందపడ్డాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. మోకాలు నుజ్జు అయ్యింది. అతన్ని స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించేలోపే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## అడవి బిడ్డకు డాక్టరేట్



సెంట్రల్ యూనివర్సిటీ ప్రతినిధుల నుంచి డాక్టరేట్‌ను అందుకుంటున్న గొర్లె శశికాంత్

**మారేడుమిల్లి:** మండలంలోని పుల్లంగి గ్రామానికి చెందిన ఆదివాసీ బిడ్డ గొర్లె శశికాంత్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందినట్టు మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ) మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్లె శశికాంత్ మారుమూల గిరిజన గ్రామమైన పుల్లంగి గ్రామంలో జన్మించి అంగన్‌వాడీ స్కూల్ నుంచి ఇంటర్ వరకు మారేడుమిల్లిలో చదివి, డిగ్రీ, పీజీ విశాఖపట్నంలో పూర్తిచేసి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎంట్రెన్స్‌లో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించినట్టు చెప్పారు. స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణ దగ్గర పీహెచ్‌డీ కెమిస్ట్రీ రీసెర్చ్ స్కాలర్‌గా చేరి, నియమిత గడువులో పీహెచ్‌డీని పూర్తి చేశారు. ఈ ఆదివాసీ బిడ్డ ఈస్థాయికి ఎదగడం పట్ల గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## గిరిజన చట్టాలు ఉల్లంఘిస్తే చర్యలు

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



పద్మపురం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

**అరకులోయ రూరల్:** గిరిజన ప్రాంతంలో 1/70, పీసా చట్టాలను గిరిజనేతరులు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం చెప్పారు. మండలంలో పద్మాపురం పంచాయతీలో ఆయన మంగళవారం పర్యటించారు, పంచాయతీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణలపై ఆయన ఆరా తీశారు. స్థానిక సచివాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ ఇకపై గిరిజన చట్టాలు ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలు చేపడితే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు గిరిజన చట్టాలు, హక్కులను కపాడాలన్నారు. ఇప్పటి తప్పిదాలే రానున్న రోజుల్లో గిరిజనులకు ఇబ్బందులు వస్తాయన్నారు. సక్రమంగా పనిచేయని అధికారులను ఉపేక్షించేది లేదన్నారు. గ్రామ సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, సంబంధిత రికార్డులు సక్రమంగా లేకపోవడంతో సిబ్బందిపై ఎమ్మెల్యే మత్స్యలింగం ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని ఆయన సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. వైద్య పరీక్షలు చేయించుకునానరు. ఆయన వెంట సర్పంచ్ సుస్మిత, రెవెన్యూ, పంచాయితీ, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

## నిస్వార్థ సేవలతోనే గుర్తింపు

అడిషినల్ ఎస్పీ జగదీష్ అడహాళ్లి



ఏఎస్ఐ భుజంగరావును సన్మానిస్తున్న సిబ్బంది

**గంగవరం:** సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమించేది పోలీసేనని, ఇటువంటి శాఖలో సుదీర్ఘంగా 37ఏళ్ల సేవలు అందించి పదవీ విరమణ చేస్తున్న ఏఎస్ఐ భుజంగరావు సేవలు అభినందనీయమని రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీష్ అడహాళ్లి అన్నారు. సోమవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై డి.భూషణం ఆధ్వర్యంలో జరిగిన ఏఎస్ఐ భుజంగారావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఏఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థ సేవలతోనే సమాజంలో ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజలు ఏడాదిలో వివిధ రకాల పండగలు, సంబరాలు ప్రజల కుటుంబాలతో జరుపుకుంటారని కానీ పోలీస్ సిబ్బంది మాత్రం 24 గంటలు విధి నిర్వహణలో ఉంటారన్నారు. అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహమూర్తి, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం ఎస్ఐలు భూషణం, రామకృష్ణ, వినోద్, ఏఎస్ఐ రజాక్, తదితరులు భుజంగరావు సేవలను కొనియాడారు. అనంతరం ఏఎస్ఐ భుజంగరావు దంపతులను ఏఎస్పీ జగదీష్ హడహళ్లి సీఐ నరసింహమూర్తి ఎస్ఐ భూషణం, సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఏఎస్పీకి కేటాయించిన సీటులో సన్మాన గ్రహీత భుజంగరావుని ఏఎస్పీ స్వయంగా కూర్చోబెట్టడం అందర్నీ ఆశ్చర్యపరిచింది.. కొద్దిసేపు భుజంగరావుతో ఏఎస్పీ కొద్దిసేపు ముచ్చటించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గంగవరం నుంచి వై.రామవరం బదిలీపై వెళ్లిన ఎస్ఐ రామకృష్ణను పోలీసు సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సిబ్బంది శ్రీను, వీరబాబు, పెద్ద, సాయి, రత్నకుమారి పాల్గొన్నారు.

## వరిలో తెగుళ్లు.. నివారణ చర్యలు

పలు సూచనలు చేసిన ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు



శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

**అనకాపల్లి:** వాతావరణ పరిస్థితుల వల్ల వరిలో పాడ తెగులు ఆశించే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాడ తెగులు నివారణ చర్యల్లో భాగంగా సిఫార్సు మేరకు ఎరువులు వేసుకోవాలన్నారు. గట్ల మీద కలుపును నివారించి, తెగులు కనిపించినట్లయితే హెక్సాప్రోతయోలేన్ 1.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో ఆకు ముడత, కాండం తొలిచే పురుగు ఆశించవచ్చన్నారు. నివారణకు 2.5 మీ.లీల క్లోరిఫైరిఫాస్ లేదా 0.3 మీ.లీల క్లోరాంత్రనిలిప్రోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సుడిదోమ ఆశించినట్లయితే నివారణకు బుప్రోఫెజిన్ 1.6 మి.లీ. లేదా ఆసిఫేట్ 1.5 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. దమ్ములో పొటాష్ వేయని వరి పొలాల్లో పొటాష్ లోపం కనిపించే అవకాశం ఉందన్నారు. నివారణకు ఎకరానికి 17 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. వరినాటిన 30 రోజులకు వెడల్పాటి ఆకు జాతి కలుపు నివారణకు 2, 4–డి సోడియం లవణాన్ని ఎకరానికి 400 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని, ఒక వేళ అన్ని రకాల కలుపు ఉన్నట్లయితే నివారణకు మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ 10 శాతం, క్లోరి మ్యురాన్ ఇథెల్ 10 శాతం(ఆల్మిక్స్) మందును ఎకరానికి 8 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. చెరకులో పసుపు ఆకు తెగులును వ్యాప్తి చేసే పేనుబంక పురుగుల ఉధృతి ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పెరిగే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ.లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త కె.వి.రమణమూర్తి, వి.గౌరీ, ఎం.విశాలాక్షి, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

## శ్రమదానంతో రహదారి పనులు



రహదారి పనులు చేస్తున్న యువకులు

**డుంబ్రిగుడ:** మండలంలోని అరకు హైవే రోడ్డు నుంచి ఏకో టూరిజం కోల్లాపుట్టు మీదుగా ఒడిశాకు వెళ్లే మార్గంలో కోర్రాయి వంతెన వద్ద రహదారి కోతకు గురైంది. రహదారికి ఇరువైపులా కాంక్రీట్, మెటల్ కుప్పలుగా పేరుకుపోయింది. దీంతో వాహనచోదకులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి స్థానికులు రహదారి మరమ్మతు పనులకు ముందుకొచ్చారు. ఇందులో భాగంగా రహదారిపై పేరుకుపోయిన బురదను, ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించి, కాంక్రీట్, మెటల్ కుప్పలను సరిచేసి, తాత్కాలికంగా మరమ్మతు పనులు చేశారు. కోర్రాయి వంతెన నిర్మాణంలో ఎత్తును పెంచి వదిలేయడంతో వర్షానికి ఇక్కడ సమస్య తలెత్తుతోందని, ప్రస్తుతం తాత్కాలిక పనులు చేశామని, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

### బోరుకు మరమ్మతు పనులు

**సీలేరు:** స్థానిక రామాలయం వద్ద ఉన్న తాగునీటి బోరు పాడైంది. దీంతో తాగునీటి కోసం స్థానికులు పడుతున్న ఇబ్బందుల గుర్తించిన స్థానికుడు సందీప్ తన స్నేహితుల సహాయంతో పాడైన బోరును మరమ్మతులు చేయించారు. దీంతో స్థానికులు అభినందించారు.